# జాడలు దొరకని నీడలు

-శ్రీలత

"ఏడంటే ఏడాకాదు... ఈడంటే ఈడాకాదు... పయిలంగా అల్లుకున్న కాకుల్లాగూడు మాది"... గొంతు చించుకుని పాడుతూ టక్కున ఆపేసి

"లచ్చిమీ.... లచ్చిమీ... యాడ దాంకున్నావేంది నాతో సరసాలాడ్డాకి..." తూలుకుంటూ గుడిసె తడిక ఒక్క తన్ను తన్నాడు.

"నిమ్మలం లేని సచ్చినోడా, తడికిరిగి పోద్దారే, తాటికూరికాడలెట్టి అల్లల్లి సచ్చిపోనాను. ఎండెండి పోనాది. పుటుక్కున ఇరిగితే పొయ్యిలోకి కూడా రాదు సన్నాసెదవా! సంకలు గుద్దుకుంటూ తాగి తిరగడవేగా, పెల్లాం పిల్లలకి కూడుందా గూడుందా అని పట్టించుకోని ఎదవా" అనరిచింది లక్ష్మి ఒక చేత్తో నూకల సట్టి కింద మంట ఎగదోస్తూ, ఒళ్ళో పిల్లాడ్ని తొడ ఊపి నిదరబుచ్చుతూ.

లచ్చిమీ... నా బంగారు లచ్చిమీ... నీకో మాట సెప్పాల. మన కట్టాలు తీరిపోయే దారి దొరికేసినాది నాకు" అన్నాడు చట్టిలో పుల్లపెట్టి గెలికి పుల్లకున్న నూకల సంకటి నాకుతూ.

"తియ్యొదవా! తిండికి తిమ్మరాజు పనికి పోతరాజు. పిల్లలకని ఒండుతున్నాను. అది కాత్తా నాకేసినావంటే పిల్లలు మాడిసత్తారు. జరుగు" అని వాడి చేతిలో పుల్ల లాక్కుని పొయ్యిలో పెట్టి భగభగమండిపోతుంటే చూసి "లెగెశె" అని ఒక్క తోపు తోసింది మొగుణ్ణి.

"నీ! మొగబతుకులంటే ఇలవలేకుండా పోనాది. మా అయ్యకాలంలో అరగంటకోసారి తన్నినా మాయమ్మ నోరిప్పేదికాదు. ఈ కాలానికి దగ్గరకొత్తే సాలు దొబ్బేసి పోతున్నారు." కిందపడి లేవకుండా లక్ష్మివైపు పొర్లాడు. పొర్లడానికి తప్పితే లేవడానికి సత్తువలేదు. తాగుడు మైకం నోటివాగుడుకు తప్పితే ఇంకే అవయవమూ పనిచెయ్యకుండా చేసేసింది.

"మీ అమ్మ మాటెత్తినావంటే తడిసిన పుల్లలు పొయ్యిలో పొగరేపినట్టు రేగిపోద్ది నాకు కోపం" సంకటి కుండ దించి నిప్పులమీద నీళ్ళు జల్లి అంది. ఆ తడికి "సుయ్యి"మని చప్పుడొచ్చి ఒళ్ళో పిల్లాడు లేచి గుక్కపెట్టి ఏడవసాగాడు. నిప్పురవ్వ ఒంటిమీద పడిందోమోనని పిల్లాణ్ణి వెల్లకిలా బోర్లా పడేసి తడిమి చూసి భుజానేసుకుని లేచింది.

"ఆగే లచ్చిమీ... నా మాటినుకోయే" అంటూ చీర కుచ్చెళ్ళు పట్టుకుని లాగాడు. ఢబీమని కూలబడింది మొగుడి పక్కన. "క్కి.... క్కి.... క్కి" అని కీచురాయిలా నవ్వి "భలే... సరసంగా లాగేసినాను గందా" అన్నాడు.

"దొంగ సచ్చినోడ నడుం ఇరగ్గొట్టేసినావు. నీ సరసం యములోడెత్తుకెళ్ళా. మీయమ్మ మడిసిని గన్నదో రోకలిబండను గన్నదో గానీ, నా బతుకు పచ్చడయిపోనాది" అని లేవబోయింది. చటుక్కున పిల్లాడితో సహా ఒళ్ళోకి లాక్కున్నాడు. బలవంతంగా ముద్దు పెట్టుకోబోయాడు. ఒక్కనెట్టు నెట్టింది. గుంజకొట్టుకున్నాడు.

"నీ యవ్వ నువ్వేటి పెళ్ళానివే? అయమ్మ సిగదరగ అయమ్మెవురే... అనసూయమ్మ.... సీ కాదు సీతమ్మ... కాదే ద్రౌపదమ్మ.... అని బుర్రకొట్టుకుని సా... విత్తెరమ్మ సీ కాదే... అదే కుష్టోడిపెళ్ళాం ఏటిసేసింది కుష్టోణ్ణి... అదేనే దాని మొగుణ్ణి బండిమీద లాక్కెళ్ళి బోగం దానింటకాడకు తీసుకెల్లనేదా? అయమ్మను సూసి నేరుసుకోవే పతిరతవవుతావు." అన్నాడు ఎగతాళిగా.

"ఆఁ తీసుకెల్తది. తీసుకెల్లదేటి మరి? తాగుబోతుసన్నాసివి నువ్వు దగ్గరికొత్తేనే కడుపులో పేగులు ఒళ్ళో పడేట్టు వాంతికొత్తాది. నీ దగ్గర పడుకోనానికే పానాలు పోతాయి. మరి కుష్టోడి దగ్గర అయమ్మెట్టా తొంగుంటాది?

"చచ్చినోడ! నీతో నేను కాపరం సెయ్యనారే

నీ రోగం నా కంటుకుంటాదీ, నీ కంత బలుపైతే ఏ బోగం దాన్దగ్గరకో తీసుకెల్తానోరే, దానికి... డబ్బులు కూడా నేనే ఇత్తానూ... నీ రోగం అంటుకుంటే... నయం సేత్తానూ అని తీస్కెల్లుంటది మరి. అంతకంటే ఏటి సేత్తది అడ్ని తప్పిచ్చుకోనానికి.'' అని మొగుణ్ణి గట్టిగా మొట్టికాయేసి విడిపించుకొని దూరం జరిగింది.

సామ దాన భేద దండోపాయాలేవీ తన పెళ్ళాం ముందు పనికిరావని అర్థం అయ్యి ఏడుపుపాయం ప్రయోగించడానికి జరుగుతున్నట్టల్లా డేక్కుని డేక్కుని దగ్గరకొచ్చి బిగ్గరగా ఏడవడం మొదలెట్టాడు. ఎంత కోపం మీదున్నా పిల్లలేడిస్తే పరిగెత్తుకొచ్చే లక్ష్మి గుర్తొచ్చి "దీని ఈకుపాయింటు ఆడున్నాది" అని కనిపెట్టేసి ఏడుస్తూ... ఏడుస్తూ... మొదలెట్టాడు.

"అశె... లచ్చిమీ నువ్వంటే నాకు పేవే. నువ్వు నన్ను దిట్టు, మాయమ్మను దిట్టు, మాయక్కను గదే మీ యమ్మను దిట్టు, నా క్కోపం రాదే. నువ్వు మా లచ్చిమి దేవతవు అన్నాడు లక్ష్మి తలకు చేతులు ఆన్చి చిటుక్కుమనిపించి

అదేం కొత్తగాదు లక్ష్మికి తాగినపుడు ''లచ్చిమిదేవి'' తాగనప్పుడు జేష్టాదేవిలా కనబడతానని తెలుసు. అందుకే

''కోసం రోసమున్నోడికి వత్తుంది. నీ కెందుకొత్తది? ఇడువురా, నీ పేవ పెళ్ళయినంక మూడునిద్దర్లనాడే తెలిసిపోనాది. పుల్లుగా తాగొచ్చి, నా జెళ్ళో మల్లెపూలు లాక్కొని నీ ముంజేతికి సుట్టకోని వాసనసూత్తా, నువ్వు ఏఏ బజారుదాంతో తిరిగిందీ, దేని దగ్గరకు రోజుకు బేరాలు తెచ్చి, ఎంత సంపాయించిందీ సెప్పినప్పుడే నువ్వొట్టి బోగం సచ్చినాడవని తెలిసింది. నీ క్కావలసింది డబ్బులు. ఆటి కోసం ఏవయినా సేత్తావు. నీ దెబ్బలకు భయపడీ, నీ ఆశలకు కట్టుబడీ ఉన్నట్టయితే పెల్లాన్నయినా సూడకుండా, రోజుకు పది బేరాలట్టుకొచ్చేసి లం....దాన్ని సేసేద్దువు. సన్నాసెదవా? తల్లి సెల్లెలి మొలలు సూపి రేటు పుచ్చుకునే జంతువు నీకు పేవలేటి? డబ్బులు... డబ్బులు కావాల. తాగనానికీ, ఊరేగనానికీ తు!" అని మొహమ్మీద ఉమ్మేసి లేవబోయింది. రెండు చేతుల్తో ఉమ్ము తుడుచుకుని చిరిగిన చొక్కాకు తుడుచుకుని,

"మా లచ్చిమి ఉమ్ము అత్తరు సాయిబు సెంటునాగుంటాది. ఒల్లు... ఒల్లు గంధంతో సేసినట్టు ఒకటే ఘుమఘుమలాడిపోతాది" అన్నాడు చీర పట్టుకుని లాగి. పైట చెంగు పేలికయి చేతిలోకొచ్చేసింది.

" ఉన్న ఒక్క సీరా సించేసినావు గదరా సేతకాని నచ్చినోడా! సాతనయితే ఓ చీరట్టుకురారా నీవు సచ్చేలోపు. అది కట్టుకుని నువ్వు సచ్చిన్నాడు సంతోషంగా ముండమోత్తను అని వాడి చేతిలో చెంగు లాక్కుని, ఊడగా మిగిలింది పైటకు సరిపోక బొడ్డుచుట్టూ తిప్పి దోపుకుంది. అదేం లెక్క చేయకుండా కళ్ళు టపటపా కొట్టి

"నువ్వట్టా గుండెలమీద పైట లేకుండా దిరుగుతుంటే పాడెమీదోడు పైకి లేసి కూసుంటాడే లచ్చిమీ... నువ్వొప్పుకుంటే డబ్బుల మీద డబ్బులు... డబ్బులు... మీద డబ్బులొత్తాయే... రాజమహాలు కట్టిత్తానే నీకు..." అన్నాడు లొట్టలేస్తూ...

ఏడుపూ బాధా ఒక్కసారిగా తన్నుకొచ్చాయి లక్ష్మికి. భయాన చెబితే వినడని నయాన మొదలెట్టింది.

"సీ! సీర సిరిగిపోయినాదని నేనేడుత్తుంటే, సోకులగుపడినాయని నువ్వు మురుత్తుండావేందిరా? పెల్లాన్ని దీపమల్లె సూసుకోకున్నా బతుకు సీకటి జెయ్యమాకురా, ఓడోడి పెల్లాం వాడకంతకూ ఒదినని, మాపేటోల్లు నన్ను చూసి లొట్టలేత్తుండార్రా. పది రూపాయలిత్తే నీ మొగుడు నిన్ను పదిరోజులంపిత్తాడే అని ఎగతాళి సేత్తుండార్రా. అట్టా సెయ్యమాకరా. నా మాటిను. నా మాటిను. నేను కట్టపడి నీకు బువ్వెడతా. నీ తాగుడికీ డబ్బులిత్తా. ఈ బోకరేపారం మానరా. ఇది మంచిపని కాదురా. ఆడదాన్నమ్ముకున్నాడు తల్లిని కడుపుని సెరిచినోడు ఒకటేరా. నా మాటినుకో" అంటూ కూలబడిన చోటు నుంచీ జరిగి దగ్గరకొచ్చి మామగడ్డం పట్టుకుంది.

ఒక్కసారిగా బావురుమని ఏడవడం మొదలెట్టి లక్ష్మి ఒళ్ళోని పిల్లాడ్ని తీసి పక్కనపడేసి లక్ష్మి ఒళ్ళో తల పెట్టుకుని కుచ్చెళ్ళు లాక్కుని మొహంమ్మీద కప్పుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. ఏడ్చీ ఏడ్చీ తల పైకెత్తి ఎదురుగా కనిపించిన గుండెలకేసి చూస్తూ...

"ఒసే లచ్చిమీ నీ గుండెలు సూత్తే మాయమ్మ గుర్తొత్తాది. ఆటికేసి తల పగలకొట్టుకుని సచ్చిపోవాలనిపిత్తదే. నీ కొడుకయిపోనాను కాదా అనిపిత్తదే" అన్నాడు ఆరున్నొక్కరాగంతో.

పిల్లాడు పాలకు కుమ్మితేనే ప్రాణం పోయేటట్టు అనిపించే గుండెలకు వీడి గుండ్రాయంటి తలకాయతో బాదితే పగిలిపోయేది నా గుండెలా వీడి తలకాయా? అని అనుమానం వచ్చినా "పాపం ఏడుత్తున్నాడు గందా" అని అనుమానం బయటపెట్టలేదు. మెల్లగా మొగుణ్ణి అనునయించడం మొదలుపెట్టింది.

"మావా మాయమ్మ తమ్ముడివని అన్నాయం అయిపోతావని నన్ను నీకిచ్చి సేసినారు. మేనమావవుగందా అని నువ్వు తిట్టినా, కొట్టినా, బేరాలట్టుకొచ్చినా తల్లినాగా తట్టుకుని నిలబడ్డా. ఏదన్నా పనిసూసుకోరా. పనిసెయ్యకుంటే మానే





తిని కూసోరా. బోకరుపని మానరా. అది మన కాపురానికి దెబ్బరా" అంది కంఠం పూడుకుపోతుంటే.

"నీ మీదొట్టే లచ్చిమీ. నాకు బుట్టిన ఈ పిల్లాడి మీదొట్టే. పెద్ద పిల్లల మీదొట్టే. నేను తాగను. తాగినా బోకరుపని సేయను. నేను సానా మారిపోయానే లచ్చిమీ. పొద్దుట్నుంచీ నీ కోసం ఆలోసించీ, ఆలోసించీ సానా బాధపడి నీ కన్నాయం సేత్తన్నానని కుమిలిపోయానే" అన్నాడు గుక్కతిప్పుకోకుండా ఏడుస్తూ మధ్యమధ్యలో ఆగుతూ.

ఒళ్ళోని మొగుణ్ణి మొహం ఎత్తి ముద్దుపెట్టుకుంది. "మావా అమ్మమ్మ సచ్చిపోతా

ఈడు నీ మొగుడు కాదే కొడుకూ'' అని అప్పసెప్పింది. మా నాయనెట్టాలేడు. నువ్వు పోతే మేం దిక్కులేనోళ్ళం అయిపోతాంరా" అంది మొహం తడుముతూ ఆబగా.

''నిన్నిడిసి పెడదామంటే మేనమామవయిపోనావు. ఉంచుకుందామంటే తాగుబోతువు అయిపోనావు. ఏం సెయ్యమంతావురా నీ మీద కోపమెంత ఉండాదో, పేమ అంతుండాది. ఏవీ సెయ్యలేక సత్తున్నానురా!'' అంది తన బ్రతుకును వెలువరిస్తూ.

ఇనుము వేడెక్కిందనీ – సమ్మెటతో కొట్టే టైమొచ్చిందనీ అర్ధమయిపోయింది లక్ష్మి మొగుడికి.

"నువ్వో పనిసేత్తే నేనన్నీ మరిసిపోతానే. ఇంకెప్పుడూ బేరాలెట్టుకోను... సచ్చిపోయిన మాయయ్య మీదొట్టు. నేను మా యమ్మకు... మా అయ్యమూల్కంగ బుట్టినోడ్నయితే ఈ మాటు మాటదప్పనే" అన్నాడు వాళ్ళమ్మ శీలానికి పరీక్షపెడుతూ. తన కక్కుర్తికి అమ్మను బలిచేస్తూ

వాడు చిన్నప్పట్నుంచీ ఎన్నో ఒట్లు వేయడం చూసింది. పెళ్ళయ్యాక కూడా ఒట్లేయడం చూసింది. వేయడమే కానీ ఏ ఒట్టు కూడా కట్టుబడదని తెలిసినా ఏ ఒట్టు కా ఒట్టు కొత్తగా ఆశపెడుతూనే ఉంటుంది లక్ష్మికి. ఈ ఒట్టు కూడా మిణుగురులా ఆశలేపింది గుండెలో.

" ఈడు గనక బేరాలాపేత్తే నేనేవయినా సరే సెయ్యాలి ఈడికోసం" అనుకుంది.

'' ఏటిసెయ్యమంటావురా'' అనడిగింది ప్రేమగానే

"ఒట్టెయ్యి" అన్నాడు. తన ఒట్టుమీద నమ్మకం లేదుగానీ పెళ్ళాం ఒట్టుమీద బోల్డంత నమ్మకం వాడికి.

"ఒట్టు" అంది పిల్లాడిమీదా, మొగుడిమీదా చెయ్యేసి.

"నీ కిడ్డీన్నీ నాకిచ్చెయ్యి" అన్నాడు తీరిగ్గా.

"నా పానాలయినా ఇత్తానుగానీ, కిడ్డీన్నీ అంటే ఏందిరా'' అంది. దార్లోకొచ్చింది బేరం అనుకున్నాడు. చటుక్కున ఒళ్ళోంచి లేచి ఎదురుగ్గా కూర్చుని

"కిడ్డీన్నీ అంటే నీ కడుపులో ఉంటాది. అదిత్తే లచ్చ రూపాయలు ఇత్తారు. అయ్యెట్టి నేను యాపారం పెట్టుకుని నిన్నూ పిల్లల్నీ కళ్ళల్లో పెట్టి సూసుకుంతా" అన్నాడు పెళ్ళాన్ని ఈజీగా బురిడీ కొట్టించేసి లైన్‌లో పెట్టిన ఆనందంతో. వెలిగిపోయే మొగుడి మొహం చూసి మురిసిపోయింది లక్ష్మి.

" అది కడుపులో ఎందుకుంది. బయట ఉంటే టకీమని ఇచ్చేద్దును కందా! నా కడుపులోది బయటికెట్టా వత్తాది? అదసలు ఎంతుంటాది? ఎట్టా తియ్యాలా? నా కడుపులో కిడ్డీన్నీ ఉంటుందని నీకెవరు సెప్పేసినారు? ఆశ్చర్యపోయింది "తన కడుపులో ఏవుందో తనకే తెలీదు ఈ డెట్టా కనిపెట్టాడబ్బా? ఎంతయినా నా మొగ్గుడు మాంఛి తెలివయినోడు. చదువొస్తే సచ్చినోడు కలక్టేరయిపోను" అనుకుంది.

" ఉస్. అదెంత... అదెంతుంటాది? కోడి గుండెకాయంత. అట్టాటియ్యి శానా ఉంటాయి కడుపులో. అదొక్కటీ తీసేత్తే ఏవీ కాదు. ఒకటి తేసేత్తే! ఇంకోటి పని సేత్తది. మనకు పనిసెయ్యడం ముక్కెంగానీ, ఒకటి సేత్తాందా? రెండు సేత్తన్నయ్యా అనిగాదు.

అద్గదిగో టి.వీ.లో రోజుకోసారి కళ్ళు ఇచ్చీయండీ కళ్ళు ఇచ్చీయండీ అని సిరంజీవి సెపుతా ఉండ్లా. అట్టనే. అసలు సిరంజీవి మూడు కిడ్డీన్నీలు ఇచ్చేసినాడంత. అయినా గానీ ఎంత బాగా డాన్సేత్తన్నాడో సూడ్లా'' అన్నాడు యుద్ధరంగంలో అర్జునుడిని చూసి నవ్విన కృష్ణుడిలా.

"మరి అంత సిన్నదానికి అన్ని డబ్బులెందుకు ఇత్తారు? మరి సిరంజీవికి శానా డబ్బులుండాయంతారు గందా ఆయనెందుకు కిడ్డీన్నీలు అమ్ముకున్నాడు?" అంది తనకెంతో బలమైన అనుమానం వచ్చిందనీ, ఇది తన మావ విప్పి చెప్పలేదనీ.

"అయ్యో పిచ్చిమాలోకవా, కూలికెళ్ళడం, పిల్లల్ని కనడం, ఆల్లకి వండి పడేయడం, నన్ను తిట్టడం తప్పించీ నీకేవీ తెల్దే. ఇంత

అమాయకురాలివి ఎట్టా బతుకుతావోనని నన్ను నీగ్గట్టి పున్నెం చేసారే మీయమ్మా మాయమ్మా" అన్నాడు తనను చేసుకోవడం లక్ష్మి అదృష్టం అని తెలియజేస్తూ.

"సిరంజీవి మూడు కిడ్డీన్లీలు పేదోల్లకు ఊరికే దాన ధర్మం సేసినాడే. ఇంకా రెండు ఇత్తానని కూడా సెప్పినాడే. ఆయన మనసున్న మారాజు. నేను నా కిడ్డీన్లీలే ఇద్దామని డాకటేరు దగ్గరికెల్తే "నీ కసలు కిడ్డీన్లీలు లేవురా" అన్నాడు. "నేను కిడ్డీన్లీలు కూడా లేని పేదోణ్ణి అయిపోనానే. కిడ్డీన్లీలు లేని ఓ బతుకూ బతుకేనా. అని సారాలో పురుగు మందు కలుపుకుని తాగబోయేముందు నా లచ్చిమినోసారి చూసెళ్దామని నీ కాడికి లగెత్తుకొచ్చేసినానే" అని లక్ష్మిని వాటేసుకుని బావురుమన్నాడు.

ఆ అరుపుకు పిల్లాడు బెంబేలెత్తి గొంతు చించుకున్నాడు. లక్ష్మి పిల్లాడ్ని భుజంమ్మీద వేసుకోబోతే లాక్కుని దూరంగా కూలేసి,

"నాకూ నా పెళ్ళానికీ మద్దె నువ్వేటిరా సన్నాసెదవ ఎల్లు! ఆ యాప సెట్టు కింద కూకుని ఏడు. దారేబోయేవోల్లు డబ్బులేత్తారు. నీ, పెల్లాంతో మాట్టాడుకోలేని బతుకయిపోనాది నాది. సత్తే పీడాపోద్ది. ఎదవ సంసారం. కట్టాలు పడలేకపోతున్నాను" అని పిల్లాణ్ణి ఒక్క తోపు తోశాడు. కొడతాడేమోనని భయమేసి, వాడినోరు తెరిచి కొంగుమూతేసి బెల్లమ్ముక్క నోట్టోకి పెట్టింది. వాడు చటుక్కున ఏడుపాపేసి చప్పరించసాగాడు కంట్లోంచి కారిన నీళ్ళతో సహా.

ఇక మొగుడి ఏడుపు కూడా చటుక్కున మాన్పించడానికి బెల్లం ముక్క సరిపోదు గనుక వీడిగోల కూడా ఆగిపోతే రాతిరికి అన్నంలోకి పచ్చడి నూరొచ్చు అనుకుంది. ఇక ఆలస్యం ఎందుకు, మావ దగ్గర కిడ్డీన్లీలు లేపోతే ఏంటి? తన దగ్గరుంటే మావదగ్గరున్నట్టే గందా? ఇద్దరం ఏరేటి? ఒకటే గందా" అనేసుకుని

"కిడ్డీన్లీయే గందా! ఒక్కటేగందా. సరే ఇచ్చేత్తాను. నువ్వు బేరాలు మానేయాల. ఇంటిపట్టునుండీ నన్నూ పిల్లల్నీ సూసుకోవాల. ఈ సవరం చేపిచ్చుకునీ, మంచ బట్టలేసుకునీ, దర్జాగ ఉండాల. నువ్వు బజారెమ్మట ఎల్తంటే,

"లచ్చిమి మొగుడూ, లచ్చిమి మొగుడూ" అని నిన్ను అందరూ తడికె సందుల్లోంచి సూడాల. అట్టాగుండాలి మరి. అయితేనే నేను కిడ్డీన్లీ ఇత్తాను. మూడయినా సరే ఇత్తాను" అంది.

"మూడొద్దులేయే ఒక్కసారీ. తక్కిన రెండు తర్వాతిద్దు గానీ నేను సిన్మాయాట్టర్నాగా దర్జాగా ఉంటాను. నువ్వు సెప్పినట్టింటాను. మరి రేప్పొద్దున్నే ఆస్పిటల్ కొత్తావా?" ఆశగా అడిగాడు.

"వత్తాలే. ముందు నువ్వు అన్నం తిను" అని సత్తు గిన్నెలో తిండి వడేసి తన మావ మారిపోయాడు. తన కట్టాలన్నీ తీరిపోయాయి. తన పిల్లలు ఇస్కూలు బట్టలేసుకుని పుస్తకాలు పట్టుకుని బడికెళ్తారు." అని రంగురంగుల కలలు కనేసింది. రాత్రంతా మావను గుండెలమీద జోకొట్టింది.

# అయినా

"ఆనందా దుఃఖం వద్దు. నిర్వేదం వద్దు.
వదులుకోలేని ప్రేమ వద్దు
నాణేన్ని వెనక్కి తిప్పి చూడు
నా విలువ ఏం మిగిలిందో కూడు.
ఒడ్డుకు చేరి వచ్చాను
తెప్ప చేతికిచ్చాను" -అంతా వింటూ
రూపాలు భావాలు బుడగలై తరగలై
హిరణ్యవతి ప్రవహిస్తూనే ఉండి
సాలవృక్ష సమీకరణాలు
సాలసిపోతున్నాయి.
రెండు చెట్ల మధ్య తథాగతుడు
తల్పాన్ని సిద్ధం చేస్తున్నాడు
అయినా
ఆనందుడు ఆక్రోశిస్తూనే ఉన్నాడు.

-డా. యు.ఏ. నరసింహామూర్తి

- - -

ఆటోలో హాస్పిటల్‌కు తీసుకెళ్ళి "ఇదో డాటర్ సారూ నా పెల్లాం కిడ్డిన్నీ ఇయ్యడానికి వచ్చింది" అన్నాడు.

"నీకు పూర్తిగా ఇష్టమే...?" డాక్టర్ అడిగాడు. డాక్టర్ పక్కనున్న ఖరీదయిన మనిషిని కూడా చూస్తూ.

"అయ్యో అదేటిబాబూ! కిడ్డిన్నీయేగందా? ఇచ్చేత్తాను. అదేదో ఒళ్ళమ్ముకునే బేరం లాగా అట్టా అనుమానంగా సూత్తారేంది" అని వాళ్ళ అనుమానం క్లియర్ చేసింది. తర్వాత జరిగేవన్నీ జరిగిపోయాయి.

- - -

మరుసటి రోజు పొద్దున్నే తెగతాగి పడున్న లక్ష్మి మొగుణ్ణి సారా దుకాణం ముందు కదిపి కుదిపి ఒకడడిగాడు.

"రోజూ ఒక పాకెట్టుకే గతుండేది గాదు. ఈయాలేంట్రోయ్ కడుప్పగిలేలా తాగావు? డబ్బులెక్కడియ్యి. నీ పెళ్ళాం బేరానికి ఒప్పుకుందా?" అంతర్జాతీయ అనుమానం వచ్చింది వాడికి.

"ఇంక రోజూ నా కడుప్పగిలేలా తాగి, పగలగొట్టుకుంటానొరే. కావాలంటే నీ కడుపు పగిలేటట్టు తాగు డబ్బులు నేనిత్తా." అన్నాడు మహారాజు పేదవాడ్ని కరుణించినట్లు.

"అన్ని డబ్బులెక్కడియ్యిరా పెల్లాన్ని పరిమినెంటుగా ఇచ్చేసినావా ఏటి? "నీ యవ్వ చిన్నయ్యా! పెల్లాం ఒల్లమ్మితే ఎంతొత్తదొరే. బతికినన్నాళ్ళు రోజుకు పది బేరాల్దెచ్చినా రానంత డబ్బులు పెల్లాం కిడ్డిన్నీలు, కళ్ళు, ఎవడయినా కొంటే కాల్లు, సేతులు, గుండెకాయ, అన్నీ అమ్మేస్తే, లచ్చాధికారి... లచ్చాధికారి అయిపోవచ్చు. నీకు పెల్లాం లేదేటి? ముసల్దయినా సరే ఒళ్ళు పనికిరాదు గానీ, కిడ్డిన్నీలు పనికొత్తయ్. అమ్ముకో... నువ్వు అమ్ముకో... శీలం సెడదు. డబ్బులొత్తాయి. నా పెల్లాం పతివరత అని సెప్పేసుకోవచ్చు" అని అటునుంచీ తిరిగి ఇటు పొర్లి పడుకున్నవాడు ఊరుకోకుండా పొర్లి పొర్లి ఏడవసాగాడు.

"ఏటయిందిరా ఏడుత్తున్నావు? నీ పెల్లాం గుర్తొచ్చిందా" అని అడిగిన వాళ్ళకు.

"నేనేం ఆడంగి ఎదవనేటిరా! మొగుడికోసం ఆడది ఏడిసినట్టు పెళ్ళాం కోసం నేనేడవనానికి?

నీ యవ్వ కిడ్డిన్నీకి లచ్చరూపాయలిత్తానని పదివేలు ఇచ్చేసి దొబ్బేసినాడే ఆ సిల్క్ సొక్కావోడు. నన్ను మోసం సేసినాడు. ఇంకో కిడ్డిన్నీ తీసుకోండిశె దానికన్నా లచ్చరూపాయలుయ్యిండొశె అంటే, నీ పెల్లాం సచ్చిపోనాది" అని బయటికి ఈడిసి పడేసినారే. సావకముందే కిడ్డిన్నీ తీసేసి ఉంటే డబ్బులన్నా వచ్చును గందా అని కుళ్ళి కుళ్ళి ఏడుత్తున్నాను" అని కాసేపు ఏడ్చి నిద్రపోయాడు. వాడు నిద్రపోయాక వాడి జేబులు తడిమి ఉన్న డబ్బులన్నీ తీసుకుని వెళ్ళిపోయాడు పలకరించినవాడు. వెళ్తూ వెళ్తూ వాడ్ని కాలితో తన్ని మరీ వెళ్ళాడు.

తండ్రినెతుక్కుంటూ వచ్చిన పిల్లలు.

"అమ్మేదయ్యా? అమ్మేదయ్యా" అని పొర్లించి పొర్లించి అడుగుతుంటే కోపమొచ్చి,

"సీ! ఎదవల్లారా! ఆడు లచ్చరూపాయలిత్తానని పదివేలే ఇచ్చేసినాడు. నేను బాధలో ఉంటే, అమ్మేది? అమ్మేది? అనేడుత్తారేందిరా? ఏటవుతాది? అమ్మనేకపోతే ఏటవుతాది? అడుక్కుంటే డబ్బులొత్తాయి. దొంగతనం సేత్తే డబ్బులొత్తాయి. నీ సెల్లెల్ని అమ్ముకుంటే డబ్బులొత్తాయి. అమ్మొంటే ఏటొత్తాది?" అని పిల్లల్ని తన్ని కొట్టీ అలసిపోయి పడ్డాడు.

పెద్ద పిల్లాడికేదో అస్పష్టంగా అర్ధమయినట్లుంది. చెల్లెల్ని చేత్తో పట్టుకుని, తమ్ముడ్ని మెడమీద వేసుకుని వెళ్తుంటే

"నా పెల్లాం సచ్చిపోయింది. నా పిల్లలు పెద్దోల్లు ఎప్పుడు గావాలా? ఆళ్ళ కిడ్డిన్నీలు పెద్దయ్యి ఎప్పుడవ్వాలా? ఆటికి మంచి రేటెప్పుడు రావాలా? నా కట్టాలెట్టాతీరాలా?" అని బిగ్గరగా అరుస్తూ పొర్లుతూ బురదలో పందిని మరిపిస్తూ....! అర్ధమయిన పిల్లలు అదేపనిగా పరుగెత్తుతూ చీకట్లోంచి, అడవిలోకో, అనంతంలోకో పరిగెత్తుతూ... పరిగెత్తుతూ... వాళ్ళ నీడలకు వాళ్ళే బెదిరి!